క్లుప్తంగా

కొనసాగుతున్న వైద్య శిబిరం



వైద్యశిబిరం వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ భూపాల్‌రెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంలో డయేరియా కేసులు నమోదు కావడంతో గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం మంగళవారం కొనసాగింది. ఈ వైద్య శిబిరాన్ని, కేసులు నమోదైన ప్రాంతాన్ని ఎంపీడీఓ భూపాల్‌రెడ్డి పరిశీలించి మాట్లాడారు. ఈ ప్రాంతంలో పైపు లీకేజీలను సరిచేసి మంచినీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. వీధుల్లో, డ్రెయినేజీల్లో బ్లీచింగ్ చల్లించామని, నీటి నమూనాలను పరీక్షల కోసం పంపినట్లు ఆయన వెల్లడించారు. వైద్యశిబిరంలో డాక్టర్ సచిన్, సీహెచ్‌ఓ వినోద్, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల హక్కుల సమితి జిల్లా ఇన్‌చార్జ్‌గా గోపియాదవ్



గోపియాదవ్

గరిడేపల్లి : మండలంలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన కుర్ర గోపి యాదవ్ భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పాస్టర్స్ ఫెలోషిప్ మండల కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

మఠంపల్లి : మండలంలోని మంచ్యాతండా బాప్టిస్ట్ చర్చిలో మండల ఐక్య పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కందుకూరి కృపానందం, చైర్మన్ సుధాకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డేవిడ్ రాజు పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పాస్టర్ బాలు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆశీర్వాదం, గౌరవ అధ్యక్షుడుగా మంగ్యా, జనరల్ సెక్రటరీ కరుణాకర్, కోశాధికారి బాలాజీ, జాయింట్ సెక్రటరీగా కృపానందం, గౌరవ చైర్మన్‌గా బాలాజీ, కార్యవర్గ సభ్యులుగా ఇసాక్, పరంజ్యోతి, నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. సమావేశంలో మండల పాస్టర్లు హుస్సేన్, ప్రేమకుమార్, దేవభిక్షం, యాకోబు, మోష, సైదులు, అబ్రహం, ప్రేమలత పాల్గొన్నారు.


క్షేత్రపాలకుడికి ఆకుపూజ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం అర్చకులు ఆంజనేయస్వామికి ఆకుపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, ఆలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి లక్ష్మణరావు, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, ఉపేందర్ భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల సర్వే



మఠంపల్లిలో ఖాళీ ప్లాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

మఠంపల్లి : మండలంలో కొద్దిరోజులుగా పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా చేపట్టిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన మంగళవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట ప్లాట్లను కొనుగోలు చేసుకుని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు చేసుకున్న వారి ప్లాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలో 900పైచిలుకు దరఖాస్తులుండటంతో టీములుగా ఏర్పడి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట కంప్యూటర్ ఆపరేటర్ నరసింహారావు, సిబ్బంది తదితరులున్నారు.

ప్రమాదకరంగా జాతీయ రహదారి

- మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న వాహనాలు
- రోడ్డు దాటేందుకు జంకుతున్న సమీప గ్రామాల ప్రజలు
- అతివేగాన్ని నియంత్రించాలని వేడుకోలు





జాతీయ రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా నిలిపి ఉంచిన వాహనాలు

మునగాల : నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారిపై రోజురోజుకు ప్రమాదాలు పెరుగుతున్నాయి. అతి వేగంతో పాటు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతో ప్రాణనష్టం ఎక్కువగా ఉంటుంది. జాతీయ రహదారిని నాలుగులైన్లగా విస్తరించిన అనంతరం తగ్గుముఖం పట్టాల్సిన రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతుండడంతో రహదారిపై ప్రయాణించే ప్రయాణికులు, రహదారి పక్క గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. రహదారి విస్తరణ అనంతరం వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్తుండడంతో ప్రమాదాల సంఖ్య పెరిగిపోతుంది. దీంతో పలువురు క్షతగాత్రులు కావడమే కాక మృత్యువు పాలవుతున్నారు. సూర్యాపేట-కోదాడల మధ్య రోజు ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా కార్లు, బస్సులు అతివేగంతో ప్రయాణిస్తుండడం పరిపాటిగా మారింది. ముఖ్యంగా గ్రామాల్లో రోడ్డు దాటే సమయంలో కనులు మూసి తెరిచేలోపులో అతివేగంతో ప్రయాణించే వాహనాల వేగానికి బలికావల్సి వస్తోందని సమీప గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్ల వెంటే వాహనాల పార్కింగ్..

రహదారిలో అక్కడక్కడ కొందరు వాహనాలను డ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక గ్రామాల శివారులలో వాహనాల అతివేగానికి ప్రతిరోజు ఏదో ఒకచోట మూగజీవాలు బలిఅవుతూనే ఉన్నాయి. కొందరు తమ పశువులను రహదారి మధ్యన గల డివైడర్లపై మేపుతుండంతో ప్రమాదాల సంఖ్య మరింత పెరుగుతున్నాయి. జాతీయ రహదారిపై అతివేగాన్ని నియంత్రించాల్సిన అధికారులు నిద్రమత్తులో ఉంటూ మామూళ్లకే పరిమితం కావడం శోచనీయం. ఇప్పటికైనా అధికార యంత్రాంగం నిద్ర మత్తు వీడి రహదారిపై వెళ్లే వాహనాల వేగాన్ని అదుపుచేసి ప్రమాదాలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

పీహెచ్‌సీకి రెగ్యులర్ డాక్టర్‌ను నియమిస్తాం

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



పాలకవీడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

నేరేడుచర్ల : పాలకవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి త్వరలో రెగ్యులర్ డాక్టర్‌ను నియమిస్తామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల తహసీల్దార్ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని, సన్నరకం వరి ధాన్యంపై ఇప్పటికే రూ.500 బోనస్‌ను ప్రకటించిందన్నారు. పాలకవీడు మండలంలోని 17వేల ఎకరాలలో 45వేల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై మండల స్థాయి అధికారులను ఒక యూనిట్‌గా తీసుకొని వారి ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దసరా సెలవులు పూర్తి అయ్యేలోపు ప్రభుత్వ పాఠశాలల్లో మౌళికవసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా మాజీ ఎంపీపీ గోపాల్ కస్తూరిబా పాఠశాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇబ్బందులు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకరాగా ఈ విషయంపై తగు చర్యలను చేపట్టాలని ఎంఈఓను ఆదేశించారు. ఆయన వెంట హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ కమలాకర్, ఎంపీడీఓ లక్ష్మి, ఏఓ కల్యాణ్‌చక్రవర్తి, అనురాధ, ధనమ్మ, నర్సయ్య తదితరులున్నారు.

లిఫ్ట్ ఏర్పాటును రద్దుచేయాలని వినతి



చింతలపాలెం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని వెల్లటూరు వద్ద నిర్మించతలపెట్టిన ఎంబీసీ ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలని లిఫ్ట్ భూ నిర్వాసిత రైతులు కోరారు. ఈ మేరకు మంగళవారం చింతలపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్ సురేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాటాడారు. సమీప రైతులను సంప్రదించకుండా గత ప్రభుత్వం లిఫ్ట్ నిర్మించాలని తలపెట్టిందని, దీంతో రైతులు తమ విలువైన భూములను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అవసరం లేని లిఫ్ట్ నిర్మాణాన్ని మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు లక్ష్మారెడ్డి, కొండారెడ్డి వెంకటరెడ్డి, బాలనర్సింహ, వెంకటాచారి, మౌలాలి, సత్యనారాయణ పాల్గొన్నారు.

మేళ్లచెరువు : చింతలపాలెం మండంలోని పాత వెల్లటూరు నుంచి మండలంలోని రైతుల పొలాల నుంచి హుజూర్‌నగర్ వరకు లిఫ్ట్ ద్వారా నీటిని అందించేందుకు చేపట్టిన పైపులైన్ సర్వే పనులను నిలిపివేయాలని భూనిర్వాసిత రైతులు మంగళవారం మండల తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడారు. రైతులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తమ పొలాల నుంచి చేస్తున్న పైప్‌లైన్ సర్వే పనులు ఎలా చేశారని, వెంటనే సర్వేను నిలపివేయాలని, విలువ కలిగిన భూములను కోల్పోతే తమకు జీవనాధారం కోల్పోతామన్నారు. కార్యక్రమంలో బాధిత రైతులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణ ఏర్పాటు అభినందనీయం



శిక్షణను ప్రారంభిస్తున్న మాజీ వైస్‌ఎంపీపీ బుచ్చిపాపయ్య

మునగాల : నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ వైస్‌ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య అన్నారు. మంగళవారం మండలంలోని తాడువాయిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నల్లగొండ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణా శిబిరం నిరుద్యోగ యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందని, నేటి యువత శిక్షణ పొంది స్వయం ఉపాధి బాటలో చైతన్యవంతులై ఉపాధి ద్వారా జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమలు, వ్యాపార అభివృద్ధికి, స్వశక్తి సంఘాల అభివృద్ధికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి శిక్షణ ఎంతగానో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రోగ్రాం కోఆర్డినేటర్, నల్లగొండ ఆర్‌సీఓ వాల్యానాయిక్ శ్రీకాంత్, గ్రామానికి చెందిన కార్యకర్త మాతంగి అంబేద్కర్, కాంగ్రెస్ నాయకుడు జిల్లేపల్లి వెంకటేశ్వరు, గ్రామస్తులు కొండమీది గుర్వయ్య, లొడంగి మహేష్, వల్లోజు మురళి, జిల్లేపల్లి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతికి పరామర్శ



పురుషోత్తమ్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాగన్న, మెప్మా ఆర్పీల సంఘం సభ్యులు

హుజూర్‌నగర్ : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తమ్‌రెడ్డి ఇటీవల హైదరాబాద్‌లో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మంగళవారం మంత్రి ఉత్తమ్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిలను ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ మెప్మా ఆర్పీల సంఘం అధ్యక్షురాలు చిట్యాల ఆదిలక్ష్మి, ఉపాధ్యక్షురాలు రాయల లక్ష్మి, ప్రధాన కార్యదర్శి కంచర్ల రమణ, కమిటీ సభ్యులు పరామర్శించారు. అనంతరం పురుషోత్తమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురువయ్య, జిల్లా సహాయ కార్యదర్శి చింతకాయల రాము, కాంగ్రెస్ నాయకుడు షేక్ జానీ పరామర్శించారు.

కోదాడరూరల్ : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తమ్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణ పరిధిలోని తమ్మర, గుడిబండ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో మంత్రిని కలిసి పరామర్శించారు. అనంతరం పురుషోత్తమరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ కమతం వెంకటయ్య, జెవీవీ జిల్లా కార్యదర్శి మక్బూల్‌పాషా, తూమాటి నాగిరెడ్డి, కుక్కడపు నాగరాజు నాయకులు తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపూరి రాజు

కోదాడరూరల్ : ఎస్సీ వర్గీకరణ లేకుండానే డీఎస్సీ ఉద్యోగ నియామకాలు చేపట్టడాన్ని ఖండిస్తూ బుధవారం కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఎంఎస్ కళాశాలలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ప్రతి నోటిఫికేషన్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. 11,026 డీఎస్సీ ఉద్యోగాల నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ లేకుండా కేటాయించడం మాదిగలను నమ్మకద్రోహం చేయడమేనని ఆయన అన్నారు. సమావేశంలో కొండపల్లి ఆంజనేయులు మాదిగ, వడ్డెపల్లి కోటేష్‌మాదిగ, కొత్తపల్లి అంజయ్య, నాగరాజు మాదిగ, అంజయ్య మాదిగ, కృష్ణ, సైదులు, విష్ణు తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ తక్షణమే అమలు చేయాలి

నడిగూడెం : ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని ఎంఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ పందిటి నవీన్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో 1200మంది మాదిగలకు ఉద్యోగాలు రావాల్సిఉండగా వర్గీకరణ అమలు చేయకపోవడంతో కేవలం 200మందికి మాత్రమే అవకాశం వచ్చిందన్నారు. దీంతో మాదిగలు తీవ్రంగా నష్టపోయారన్నారు. తక్షణమే వర్గీకరణను అమలు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో సంఘం నాయకులు వంశీ, విజయ్, నిఖిత్, రాహుల్, అవినాష్, శ్రీపతి, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు



నేరేడుచర్ల : శివాలయంలో దుర్గామాత వద్ద కుంకుమార్చన చేస్తున్న మహిళలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా శ్రీ అన్నమయ్య భజన మండలి బృంద సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కనకదుర్గ సేవా సమాజం సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పూజలు.. అన్నదానం

పట్టణంలోని సీతారాంనగర్‌లో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ సన్నిధానంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్‌చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, కౌన్సిలర్లు కొమ్ము శ్రీను, గాయత్రి భాస్కర్, విజయవెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, చంద్రశేఖర్, వెంకట్, వినయ్, సురేష్, సాయికుమార్, నాగేంద్ర బాబు, శివకృష్ణ, గంగరాజు, రమేష్ పాల్గొన్నారు.

మఠంపల్లి : దేవిశరన్నరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం మండలంలో దుర్గామాతకు మహాలక్ష్మీదేవి అలంకారంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కనకదుర్గా ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. అదే విధంగా హనుమంతులగూడెంలో గ్రామస్తులు, భక్తులు రూ.10లక్షల 50వేల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించి పూజించారు. అనంతరం అన్నదానం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీమహాలక్ష్మీదేవి అవతారంలో దుర్గామాత

మునగాల: దేవినవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరోరోజైన మంగళవారం దుర్గామాత శ్రీమహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీవెంకట కనక దుర్గ దేవాలయం, శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయంలో దుర్గామాతకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

మండలంలోని ముకుందాపురంలో దుర్గామాత శ్రీమహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.



మఠంపల్లి : హనుమంతులగూడెంలో రూ.10లక్షల 50వేల కరెన్సీతో అలంకరణ



హుజూర్‌నగర్ : శ్రీమహాలక్ష్మీదేవి అలంకరణలో కొలువుదీరిన అమ్మవారు

నేరేడుచర్ల : దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని విజయదుర్గ ఆలయం, శివాలయంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారికి మహిళలు కుంకుమార్చనలు చేయించారు. కార్యక్రమంలో ఆయా ఆలయాల కమిటీ చైర్మన్లు కొణతం ఆదిరెడ్డి, రాచకొండ రామకోటేశ్వర్‌రావు, సభ్యులు కొణతం చినవెంకట్‌రెడ్డి, నాగండ్ల శ్రీధర్, కృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, గణేష్‌రెడ్డి తదితరులున్నారు.

దుర్గామాత మండపాల వద్ద అన్నదానం

మున్సిపాలిటీలోని నర్సయ్యగూడెం, ఆటోనగర్‌లో నెలకొల్పిన దుర్గామాత వద్ద ఉత్సవ కమిటీ నిర్వాహకులు మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్‌చైర్మన్ అలక సరిత, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్, పార్టీ అధ్యక్షుడు కొణతం చినవెంకట్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అప్పిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సురేష్‌రెడ్డి, కౌన్సిలరు తదితరులున్నారు.

ఘనంగా కుంకుమ పూజ

గరిడేపల్లి : మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో ముత్యాలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన దుర్గాపరమేశ్వరి శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం ఆరో రోజు అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కమిటీ, దాతల సహకారంతో మహిళలు సామూహిక లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నడిగూడెం : మండల వ్యాప్తంగా దేవీనవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. భక్తుల పూజలు చేశారు.



హుజూర్‌నగర్ : పూజల్లో పాల్గొన్న మున్సిపల్ వైస్‌చైర్మన్ సంపత్ రెడ్డి, కౌన్సిలర్లు



గరిడేపల్లి : కుంకుమ పూజ..



మునగాల : ముకుందాపురంలో..



నడిగూడెంలోని గొల్లబజారులో కుంకుమార్చన



కోదాడ : నయానగర్‌లో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



హుజూర్‌నగర్ : అన్నదానం ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు

గ్రామదేవతలకు జలాభిషేకం



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

హుజూనగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ, మాచవరం గ్రామాల్లో దుర్గామాత శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా గ్రామ అర్చకులు బలరామమూర్తిశర్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం ముత్యాలమ్మ తల్లి, బొడ్రాయి (శీతలపరమేశ్వరి)కి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గ్రామంలో పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయని, గ్రామదేవతల అనుగ్రహం పొందడానికి మహిళలతో జలాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్దలు, నవచైతన్య యువజన మండలి సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పెండింగ్ పనులపై సమీక్ష

మునగాల : మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో వీబీకే మహిళలు, ఏపీపీ కమిటీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీపీఎం ఐబీ లక్ష్మీనారాయణ, ఏపీఎం నాగెల్లి నగేష్, ఏఏపీ సభ్యులు, వీబీకేలు పాల్గొన్నారు.

ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదు

హుజూర్‌నగర్ : దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు, ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదని ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయినిగూడెంలో దుర్గామాత విగ్రహం వద్ద శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో ప్రొబెషనరీ ఎస్‌ఐ అజయ్‌కుమార్, ఏఎస్‌ఐ జె.రమేష్, నరేష్, కాశయ్య, చలపతిరెడ్డి, మోదాల సైదులు, సావిత్రి పాల్గొన్నారు.

ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

మఠంపల్లి : దేవినవరాత్రి ఉత్సవాలు ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుతంగా జరుపుకోవాలని హుజూర్‌నగర్ సీఐ గజ్జె చరమందరాజు అన్నారు. మంగళవారం మండలంలోని యాతవాకిల్లలో దుర్గామాత వద్ద ఆయన ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మాట్లాడారు. అనంతరం ఉత్సవ కమిటీ, గ్రామస్తులు సీఐని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వంటిపులి శ్రీనివాస్, నాగరాజు ఉన్నారు.

స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

కోదాడరూరల్ : పట్టణంలోని రంగాథియేటర్‌లో రాయపూడి నాగేశ్వరావు-ఉదయలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులు మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడారు. ప్రతిఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉన్నారు.

దాతల సహకారంతో పశు వైద్యశిబిరం

కోదాడరూరల్ : పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని కాపుగల్లులో దాతల సహకారంతో ఏర్పాటు చేసి పశువైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాడి రైతులు పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక పశువైద్యశాలకు త్వరలోనే నూతన డాక్టర్ రానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గేదెలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, పీఏసీఎస్ చైర్మన్ నంబూరి సూర్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, మాజీ సర్పంచ్ తొండపు సతీష్, కాసాని రామారావు, ఎం.మురళీ, జగన్, బాబురావు, శేషగిరిరావు, రాజు, డాక్టర్ పెంటయ్య ఉన్నారు.

రహదారికి మరమ్మతులు

మఠంపల్లి : మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చౌటపల్లి వద్ద ఊరచెరువు కట్టతెగి చౌటపల్లి-మేళ్లచెరువు రహదారి ధ్వంసమైంది. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల కోరిక మేరకు ఎట్టకేలకు నీటిపారుదల అధికారులు స్పందించి మంగళవారం రహదారికి మరమ్మతులు చేపట్టారు. ఈ పనులకు స్థానిక నాయకులు పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు మద్ది హుస్సేన్ రెడ్డి, కంచాల శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.